తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 27 - 04 - 2025 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

# దొంగ స్వాములకు దేహశుద్ధి

## పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పనకబండ గ్రామంలో శనివారం ఇంటింటికి తిరుగుతున్న దొంగ స్వాములను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి గ్రామపంచాయతీలో బంధించి పోలీసులకు అప్పగించారు. ఆంజనేయస్వామి మాలలో ఉన్న జనగాం జిల్లా స్టేషన్ గణపూరుకు చెందిన అన్నదమ్ములు కల్లెం విజయ్, కృష్ణ, జీవన్‌లాల్ శనివారం గ్రామంలో తిరుగుతూ ఆంజనేయస్వామి మాలలో ఉన్నామంటూ ఇంటింటికి వెళ్లి భిక్ష అడిగారు. గ్రామంలో కొందరికి మాయమాటలు చెప్పి పలువురి నుంచి డబ్బులు కూడా వసూలు చేశారని గ్రామస్తులు తెలిపారు. కాగా గ్రామానికి చెందిన పైళ్ల సతీష్ ఇంటికి వెళ్లి మీ ఇంటిపై నర దృష్టి ఉందని, సంతానం లేనందున పూజలు చేస్తే మీకు సంతానం కలుగుతుందని నమ్మిం చారు. దీంతో సతీష్ దంపతులు వారి మాయ మాటలు నమ్మగా పూజలకు రూ. 19 వేలు ఇవ్వాలని అడగడంతో అంత ఇవ్వ లేమని చెప్పి చివరకు రూ. 11వేలకు మాట్లాడుకుని రూ. 2500 ఫోన్ పే కొట్టాడు. ఈ నేపథ్యంలో వారి ప్రవర్తన చూసి అనుమానం వచ్చి గ్రామంలో పెద్దలకు చెప్పారు. దీంతో దొంగ స్వాముల బాగోతం



బయటపడటంతో గ్రామస్తులంతా వారికి దేహశుద్ధి చేసి గ్రామపంచాయతీలో బంధించారు. అనంతరం మోత్కూరు పోలీసులకు అప్పగించారు. పోలీసులు తమదైన స్టైల్లో వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిసింది.




# ఉగ్రవాదుల దాడి అత్యంత దారుణం

## ❑ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజావారధి/మోత్కూరు

కశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత దారుణమని ఆర్యవైశ్య సంఘం మోత్కూరు పట్టణ అధ్యక్షుడు మొగుళ్లపల్లి సోమయ్య అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో కశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సోమ వెంకటేశ్వర్లు, గుజ్జ సోమనర్సయ్య, బుక్క విశ్వనాథం, అనంతుల వెంకటేశ్వర్లు, గౌరు శ్రీనివాస్, ఇమ్మడి రమేష్, వీరవెల్లి ప్రవీణ్, బుక్క కమలాకర్, గందె రంగయ్య, బుక్క రమేష్, గౌరు ప్రకాష్, మురారిశెట్టి అనిల్, అనంతుల అశోక్, దామెర వాసు, హరికృష్ణ, వినోద్, అరుణ్కుమార్, శ్రీధర్, బండారు రాజేంద్రప్రసాద్, నరేష్, సత్యం, మణి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా..

# అర్హులైన పేదలనే ఎంపిక చేయాలి

▶▶ బీజేపీ మోత్కూరు మండల అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్

ప్రజావారధి/మోత్కూరు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పేదలను విస్మరిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని బీజేపీ మోత్కూరు మండల అధ్యక్షుడు గుదె మధుసూదన్ యాదవ్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలు చేపడతామని, గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందన్నారు. రాజకీయ నాయకుల చెప్పుచేతల్లో ఇందిరమ్మ కమిటీల పేరుతో లబ్ధిదారులను గుర్తిస్తూ నిజమైన పేదలకు ఇండ్లు రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఒకవైపు గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని, రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ కాంగ్రెస్ నాయకులు గూడు లేని పేదలకు ఇండ్లు మంజూరు చేయకుండా అన్ని విధాలుగా ఉన్నవారినే ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. నిలువ నీడ లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయకుండా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న నాయకులకే



ఇండ్లు మంజూరు చేస్తే మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపతామని హెచ్చరించారు.

### చెరువు బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న

## సెల్ టవర్ పనులు నిలిపివేయాలి



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు పెద్ద చెరువు బఫర్ జోన్లో నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ ఏవో జగన్‌కు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మిస్తున్న ప్రదేశం బఫర్ జోన్‌లో ఉందని రెవెన్యూశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారని, మున్సిపల్ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ధ్రువీకరించారని తెలిపారు. సెల్ టవర్ నిర్మాణానికి ట్రాన్స్‌కో, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. సెల్ టవర్ నిర్మాణం నిలిపి వేయని పక్షంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు వెంకటనర్సు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్రు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

### మోత్కూరు టు హైదరాబాద్

# ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించాలి

### గుట్ట డీఎంకు వినతిపత్రం అందజేత

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు నుంచి ఉదయం 4 గంటలకు హైదరాబాద్, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ నుంచి మోత్కూరుకు ఆర్టీసీ నూతన బస్‌సర్వీస్ ప్రారంభించాలని మోత్కూరుకు చెందిన



బయ్యని రాజు, మామిడాల యాకేష్ కుమార్ కోరారు. శనివారం యాదగిరిగుట్ట డిపో మేనేజర్ సిహెచ్.మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోత్కూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, వివిధ రకాల పనులపై ఉదయం త్వరగా హైదరాబాద్ వెళ్లడానికి, రాత్రి ఆలస్యమైనా హైదరాబాద్ నుంచి మోత్కూరు రావడానికి బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మోత్కూరు నుంచి ఉదయం 4 గంటలకు ఉప్పల్, హైదరాబాద్ వరకు, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి మోత్కూరులో నైట్ హాల్ట్ చేసి, తిరిగి ఉదయం 4 గంటలకు హైదరాబాద్ బయల్దేరేలా బస్సు సర్వీస్ ప్రారంభించాలని కోరారు. బస్సు సర్వీస్ ప్రారంభిస్తే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.

## ప్రాజెక్టు ఫీడర్ ఛానల్‌లో
# రైతుల శ్రమదానం

### గుర్రపు డెక్క, చెత్త చెదారం తొలగించిన రైతులు

ప్రజావారధి/శాలిగౌరారం

ఎవరో వస్తారని..ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులు కొందరు శ్రమదానం చేసి కాల్వను క్లీన్ చేశారు. శాలిగౌరారం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న ఫీడర్ ఛానల్‌లో అమ్మనబోల్ జలకుంట హెడ్ వర్క్ షట్టర్ల వద్ద పేరుకపోయిన గుర్రపు డెక్క, చెత్త చెదారాన్ని శాలిగౌరారం మండలం గురజాల గ్రామ రైతులు పది మంది తొలగించారు. పల్లివాడ నుంచి కొత్తపెల్లి వరకు ఉన్న ఈ ఫీడర్ ఛానల్‌లో అక్కడక్కడ గుర్రపు డెక్క పేరుక పోయి లేదు. అధికారులు గుర్రపు డెక్కను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం కారణంగా శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు సక్రమంగా రావడం లేదని, దీంతో తామే స్వయంగా గుర్రపు డెక్కను శ్రమదానం చేసి తొలగించుకుంటున్నామని రైతులు తెలిపారు. రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణ రెడ్డి, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేష్, గురజాల మాజీ సర్పంచ్ ననుబోతు అంజయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు లొడంగి మహేష్, లొడంగి సైదులు ఆధ్వర్యంలో రైతులు శ్రమదానంలో పాల్గొన్నారు.



శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు సాఫీగా రావడం

## 28న భూభారతిపై అవగాహన సదస్సు

ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 28న సోమవారం ఉదయం 9 గంటలకు మండలస్థాయిలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.యాదగిరి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలాత్రిపాఠీ హాజరవుతున్నారని తెలిపారు. అవగాహన సదస్సులో అన్ని గ్రామాల నుంచి రైతులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో..
# నిరుపేదలకు ప్రాధాన్యతనివ్వాలి



ప్రజావారధి/శాలిగౌరారం

ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాల్లో వెనుకబడిన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్, కాంగ్రెస్ మాదారం గ్రామశాఖ అధ్యక్షుడు తోటకూరి పరశురాములు కోరారు. శనివారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నాయని తెలిపారు. రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంటి నిర్మాణం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నవారిని ఎంపిక చేయాలని కోరారు.